

# చెహోవ్ కథలు

**1899లో** చెహోవ్ తన రచనల కాపీరైట్ హక్కులన్నీ మార్క్స్ అనే ప్రముఖ రష్యన్ ప్రచురణకర్తకు 75,000 రూబుల్లకు అమ్మేశాడు. ఈ ఒప్పందం ప్రకారం గత యిరవైఏళ్లుగా వివిధ పత్రికలో పడివున్న తన రచనల్నీ చెహోవ్ సేకరించి పదిసంపుటాల ఎడిషన్‌గా తీసుకురావడానికి మార్క్స్ కు సహకరించాలి. రచనలు సేకరించి, సరిదిద్ది, సంపుటీకరించి, ప్రూఫులు దిద్దటంలోని శ్రమ చెహోవ్ సహనాన్ని పరీక్షించింది. 24.11.1899 నాటి వుత్తరంలో చెహోవ్ "కఠిన పరిశ్రమకు అలవాటు పడినవాడినే అయినప్పటికీ ఈ పని నాకు భరించలేనిదిగా తయారవ ్తున్నది. ఇన్నాళ్లు రాత్రింబగళ్లు కష్టపడితే ఇంకా రెండో సంపుటం దగ్గరే వున్నాను. ఈ చాకిరీ నన్ను యింత పిల్చి పిప్పి చేస్తుందని ముందరే తెలిసుంటే మార్క్స్ దగ్గర నేను 75 వేలు కాదు, లక్షా 75వేలు డిమాండ్ చేసేవాడిని" అంటాడు.

ఈ సంపుటీకరించే కార్యక్రమానికి చెహోవ్ తన జవసత్వాను ఎంతగా ధారపోశాడో చెప్పటానికి ఒక చిన్న నిదర్శనం.



## కథకాని కథ

చెహోవ్ 'ఫెయిరీ టేల్' అని ఓ కథ రాశాడు. ఆ కథ మూడు భాగాల్లో వుంటుంది. తన సమగ్ర రచనల్లో చేర్చేటప్పుడు చెహోవ్ ఆ కథలోని మూడోభాగాన్ని తీసేసి కథపేరు 'ది బెట్' గా మార్చడంతో కథాస్వరూపమే మారిపోతుంది.

'ది బెట్' కథలో...

ఓ ధనికుడూ, ఓ పేద యువకుడూ మరణశిక్ష గురించి చర్చించుకుంటారు. జీవితఖైదు కన్నా మరణశిక్ష మేలు అంటాడు ధనికుడు. జీవితఖైదు అంటే పదిహేను సంవత్సరాలే. 'ఆ పదిహేను సంవత్సరాలు నేను భరించగలను' అంటాడు యువకుడు. రెండు మిలియన్ల రూబుల్ల పందెం కాస్తాడు ధనికుడు. పదిహేను సంవత్సరాలకన్న ఒక్క గంట ముందు బైటికి వచ్చినా యువకుడు పందెం ఓడినట్టే.

పదిహేను సంవత్సరాలు గడుస్తాయి. చివరిరోజు. ఈ జీవిత ఖైదు కాలంలో యువకుడు చదువుకోవటానికి పుస్తకాలడుగుతాడు. అయితే ఈ పదిహేనేళ్లలో ధనికుడి ఆర్థిక పరిస్థితి మారిపోయింది. వ్యాపారంలో నష్టం వస్తుంది. రెండు మిలియన్ల రూబుల్లు ఇవ్వగలిగిన స్తోమతు లేదు. ఎలాగైనా ఖైదీని చంపేస్తే తనకు డబ్బు మిగుల్తుంది. ఖైదీ గదిలోకి వెళ్లగానే అక్కడ కనిపించిన దృశ్యం.

కొవ్వొత్తి వెలుగుతున్నది. టేబుల్ ముందర కూర్చున్నాడు ఖైదీ. అతడి వీపు మాత్రమే కనిపిస్తున్నది. టేబుల్ మీద, కుర్చీలమీద, నేలమీద పుస్తకాల గుట్టలు. టేబుల్ చివర ఓ కాగితం పడున్నది. దానిమీద సన్నటి దస్తూరితో ఇలా రాసున్నది.

"రేపు అర్ధరాత్రి పన్నెండుకి నాకు విముక్తి కలుగుతుంది. అప్పుడు నేను మళ్లీ మనుషులతో సంపర్కం పెట్టుకోవచ్చు. ఈ గదిని వదిలి మళ్లీ సూర్యోదయాన్ని చూడగలగడానికి ముందు నేను కొన్ని విషయాలు చెప్పాలి. నా ఆత్మసాక్షిగా నేనో ప్రకటన చెయ్యదలచుకున్నాను. స్వేచ్ఛ, ఆరోగ్యం, జీవితం యివేవీ నాకిష్టం లేదు. మీరు

ఉత్తమమైనవి, వున్నతమైనవి అనుకున్నవన్నీ నేను ద్వేషిస్తాను.

ఈ పదిహేనేళ్లు పుస్తకాల ద్వారా నేను జీవితాన్ని అధ్యయనం చేశాను. పుస్తకాల్లోనే నేను పువ్వుల సుగంధాల్ని పీల్చుకున్నాను. పుస్తకాల్లోనే మధువుతాగి మత్తెక్కిపోయాను. సుందరాంగనల పరిష్వంగాల్ని పుస్తకాల్లో అనుభవించాను. ప్రకృతి అద్భుతాలను పుస్తకాలలో దర్శించాను. జీవితాను భవమంతా పుస్తకాలలో దొరికింది. పర్వత శిఖరా లెక్కను. సముద్రపులోతులలో ఈదులాడాను. ఆకాశంలో విహరించాను. తుఫానుల నధిగ మించాను. పిడుగులనూ, మెరుపులనూ ఆహ్వానించాను. అప్సరసల, బ్రహ్మరాక్షసుల సాంగత్యంలో జీవించాను. ఆకాశపుటంచులూ, అధోలోకపు చీకటి గుహ్వాదాలూ నాకు పరిచితాలు. విశ్వాంతరాళపు నాగరికుణ్ణి నేను.

మానవ మేధోపరిమితులు నాకు అవగత మయ్యాయి. ఈ చిన్న కంకాళంలో ఎన్ని అనూహ్యమైన రహస్యాలు. స్వేచ్ఛగా బయట తిరుగుతున్న మీ అందరికన్నా ఎక్కువ జీవితం తెలుసు నాకు. అంతా శూన్యం, భ్రమ. జ్ఞానం మృగతృష్ణ. ఒకనాడు మృత్యు చ్ఛాయ ఈ భూమ్మీద పరచు కొంటుంది. అప్పుడు అందరం సూక్ష్మక్రిముల కన్నా అధ్వాన్నంగా తుడిచిపెట్టుకు పోతాం. ముందు తరాలు లేవు. అమరత్వం ఎవరికీ లేదు. మీ జీనియస్సంతా ఘనీభవించే రోజూ, దగ్ధమయ్యేరోజూ చేరువలోనే వుంది.

అబద్ధాలను నిజమని నమ్ముతారు. వికృ తత్వమే సౌందర్య భావన మీకు. మీకు అన్నీ ఆశ్చర్యమే మరి. నారింజచెట్ల మీద ఆపిల్స్ పండుతాయి. పళ్లకు బదులుగా కప్పలూ, బల్లులూ కాస్తాయి చెట్లకు. గులాబీతోటల్లో చమటదుర్గంధం ఉంటుంది. ఇహలోకం కాదని పరలోకాన్ని యిష్టపడే మూర్ఖుల్లారా, నేను మీకు అర్థం కాను. మిమ్మల్ని అర్థం చేసుకోవాలనే కోరిక నాకు లేదు' మిమ్మల్నీ, మీ విలువల్నీ తృణీకరిస్తున్నాను. అందుకు నిదర్శనంగా నేను గెల్చుకున్న రెండు మిలియన్ల రూబుళ్లనూ నిరాకరిస్తున్నాను. ఒకప్పుడు డబ్బు నాకు స్వర్గం. ఇప్పుడది నాకు గడ్డిపోచతో సమానం. అందుకోసమే, గడువు కన్నా అయిదు నిమిషాలు ముందర బయటికొస్తాను"

ధనికుడు అది చదివి తృప్తిగా నిట్టూర్చి, మనసులో ఖైదీకి కృతజ్ఞలు చెప్పుకొని ఇంటికి వెళ్లిపోయాడు.

తెల్లారి తెలుస్తుంది ఖైదీ గడువుకు ముందే పారిపోయాడని. దనికుడు ఖైదీ రాసుకున్న స్టేట్‌మెంట్ కాగితం తెచ్చుకొని యినప్పెట్టిలో దాచుకుంటాడు.

'ది బెట్' కథ అలా ముగుస్తుంది. మూలకథలో చెహోవ్ తొలగించిన మూడోభాగం యిప్పుడు చదవండి.

ఓ సంవత్సరం గడిచింది. ధనికుడు ఓ పెద్ద పార్టీ ఇస్తున్నాడు. అతిథులు అందరూ సంపన్నులే! 'జీవిత పరమార్థం, విధి' లాంటి విషయాల గురించి చర్చ జరుగుతున్నది. అందరిదీ ఒకటే అభిప్రాయం. డబ్బు చాలా తుచ్ఛమైనది. 'ఆరాధ్యులైన మహాత్ములెందరో వున్నారు కదా. అందులో ఒక్కరూ ధనికుడు కాడు. ధనాన్నీ, సుఖభోగ విలాసాలనూ త్యజించినవారే కదా మహనీయులు.

"అవునవును. సర్వసంగపరిత్యాగమే ముక్తికి మార్గం"

"సన్యాసులకూ స్టాకు ఎక్ఛ్సేంజి వ్యాపారులకూ సంబంధం ఉండదు" ఓ అతిథి కల్పించుకుని.

"ఇదంతా పట్టి నాన్సెన్సు. త్యాగానికి 'అర్థం లేదు. కళను తిరస్కరిస్తే కళాకారుణ్ణి తిరస్క రించినట్టు కాదా! స్త్రీసౌందర్యాలు, ప్రకృతి

**రష్యన్ మూలం: చెహోవ్**

**తెలుగు గొంతు: కరుణారుణ**

సంపదలు యివన్నీ భగవత్ప్రసాదం కాదా. వీటిని తిరస్కరిస్తే భగవంతుణ్ణే తిరస్కరించినట్టు కాదా."

"కరెక్ట్. పైగా ఈ సర్వసంగపరిత్యాగాలు మన వూహల్లో మన ఆదర్శాల రూపంలో వుంటారు. ఈ లోకంలో ఎక్కడా అలాంటి శాల్తీలు కనిపించరు. అయితే ఆర్గ్యుమెంట్ కోసం కొన్ని చెప్పుకోవచ్చులే. ఉదాహరణకు వయసు మీరిన పురుషులకు యువతులు అక్కర్లేదు. అలాగే డబ్బు విలువ తెలియని వాడికి డబ్బు అక్కర్లేదు. అంతే కాని డబ్బు అక్కర్లేదనే యాంబిషన్, కుర్రాణ్ణి యింతవరకూ చూడలేదు నా సుదీర్ఘ జీవితంలో"

"అలాంటి యువకులున్నారు" అన్నాడు మన ధనవంతుడు.

"నువ్వు చూశావా?"

"ఆఁ. నా అనుభవంతో చెబుతున్నాను"

"ఇంపాజిబుల్"

"నేను నిరూపించగలను. ఓ యువకుడు రెండు మిలియన్ల రూబుళ్లు గెలుచుకొని, తిరస్కరించి వెళ్లిపోయాడు"

"అంతా భ్రమ. అలాంటివాళ్లుండరు గాక వుండరు"

"నేను పందెంకాస్తాను. ఓడిపోతే మూడు మిలియన్లు యివ్వాలి మరి"

"ఓకే!"

మన ధనికుడి తల తిరిగిపోయింది. ఆడుతూ పాడుతూ మూడు మిలియన్లు గెలుచుకున్నాడు. పందెం అయిదు మిలియన్లు కట్టితే ఇంకా బాగుండేది

"ఎప్పుడు నిరూపిస్తావు మరి?"

"ఇప్పుడే. తక్షణమే"

ఇనప్పెట్టి తెరచి కాగితం తీసుకురావటానికి లోపలికి వెళుతుంటే, "మీకోసం ఎవరో వచ్చారండీ"అన్నాడు బట్లర్.

మన ధనికుడు హాల్లోకి వెళ్లిచూస్తే ఓ మధ్య వయస్కుడు, దీనంగా చూస్తూ "నమస్కారమండీ", అన్నాడు.

"ఏం కావాలి?"

"నేనే. జ్ఞాపకం లేదా? పదిహేను సంవత్సరాల జీవితం త్యాగం చేసి రెండు మిలియన్ల రూబుళ్లు కూడా వదులుకున్నాను."

"అయితే ఇప్పుడేం కావాలి?"

"నేను చాలా పొరపాటు చేశాను. జీవితాన్ని చూడకుండానే నేను జీవితాన్ని గురించి ఏవేవో తీర్మానాలు చేశాను. జీవితం నిజంగా అద్భుతమైంది. ఈ ఎండ, ఈ గాలి, ఈ సుఖాలు. ఈ స్త్రీ సౌందర్యాలు. ఈ భోజనం. నిజజీవితపు పేలవపు ప్రతిబింబాలు మాత్రమే కనిపిస్తాయి పుస్తకాల్లో. పుస్తకాలు కాదు ముఖ్యం. జీవితం, సార్, రెండు మిలియన్లు వదులుకున్నాను. అంత సంపదమీద ఇప్పుడు నాకే హక్కు లేదు. కాని దయతలచి ఒకటి రెండు లక్షలిప్పించండి. జీవితం దుర్భరంగా ఉంది. డబ్బులేకపోతే నాకు ఆత్మహత్య తప్ప గత్యంతరం లేదు."

"సరే. రేపుదయం కనిపించు"

ఆ క్షణాన ధనవంతుడికి కొత్త ప్రేరణ ఏదో కలిగింది. ఇన్నేళ్లూ అర్థం కాని విషయమేదో తెలిసి వచ్చింది. డబ్బు ముఖ్యం కాదు. ఈ లోకం, ఈ సుఖాలు, ఈ పదాల గారడీలు ఏదీ ముఖ్యం కాదు. పదిహేనేళ్ల జీవితాన్ని త్యాగం చేసిన ఆ వ్యక్తికి తన ఆస్తంతా రాసిస్తాడు. ఆ తర్వాత అన్నీ వదిలేసి వెళ్లి ఎక్కడో ఒంటరిగా శేషజీవితం గడుపుతాడు. కాని, ఆ మనిషికి తనకున్న సంపదంతా యిచ్చినా రుణం తీర్చుకోలేడు. ఈ లౌకిక సుఖాల మీద తనకే హక్కూ లేదు.

'నువ్వు గెలిచావు. నేనోడిపోయాను' అనుకున్నాడు. ■